క్లుప్తంగా

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీకి చెందిన నర్సింహాపురం గ్రామ మహిళా రైతు గామాసు నారాయణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, ఆమె పేరిట సొసైటీలో గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించగా రూ.50వేలు మంజూరైంది. ఈ నగదును శనివారం మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయంలో మృతురాలు భర్త గామాసు జోగయ్యకు బ్యాంక్ మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జానీ, సొసైటీ సిబ్బంది మురళీ, రమణారెడ్డి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

సత్తుపల్లిరూరల్: మైనర్లు వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు పెరుగుతున్నందున తల్లిదండ్రులు కట్టడి చేయాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ, అభివృద్ధి సొసైటీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దనే నిబంధనలపై పోలీసులు విస్తృత ప్రచారం చేస్తున్నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈవిషయమై పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు సూచనలు చేయాలని కోరారు.

పన్నుల నిర్బంధ వసూళ్లు ఆపాలి



మాట్లాడుతున్న వీరభద్రం

వైరా: వైరా మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధంగా ఇంటి పన్నులు వసూలు చేయడం సరికాదని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం వైరాలో మచ్చా మణి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రోడ్లు, డ్రైయిన్లు, కరెంట్ పోల్స్ తదితర సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు, నాయకులు హరి వెంకటేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు అనుమోలు రామారావు, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

సత్తుపల్లిరూరల్: ఈ నెల 5వ తేదీ నుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు శనివారం సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని పరీక్షలు నిర్వహణ అధికారులు ప్రత్యేకమైన బాక్సుల్లో ఉంచి పోలీస్ స్టేషన్ లాకర్లో భద్రపరిచారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారానికి చెందని రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ రాచమళ్ల కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ శనివారం కృష్ణమూర్తి నివాసంలో ఆయన చిత్రపటం నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు వినుకొండ కృష్ణ, రాచమళ్ల రాము, నవీన్, వంకదారు వాసు, దిలీప్, బాలాజీ, వందనపు వెంకటేశ్వరరావు, రాచమళ్ల నాగేంద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మధిర: మహాశివరాత్రి పండుగ సందర్భంగా మధిర మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద జరుగుతున్న జాతరకు వచ్చిన నిరుపేదలకు, యాచకులకు శనివారం సామాజిక సేవకుడ లంకా కొండయ్య ఆధ్వర్యంలో ఉచితంగా దుప్పట్లు, పాదరక్షలు పంపిణీ చేశారు. మధిర పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన తోట కాంతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు లక్ష్మి, రాము, రమణ ఆర్థిక సాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు కొండయ్య తెలిపారు. కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు సత్యం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

కల్లూరు: కల్లూరులోని విజ్ఞాన్ విద్యానికేతన్‌లో శనివారం 31వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌కే ఇస్మాయిల్ ఆధ్వర్యంలో భాగం ప్రభాకర్ చౌదరి, నీరజాదేవీలను సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరసింహారావు, కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ

- ఆలస్యమైన పూత
- ఎన్ని మందులు స్ప్రే చేసినా నిలవని మామిడి పూత
- మామిడి రైతులకు ఈ ఏడాది గడ్డు పరిస్థితులు
- వాతావరణంలో మార్పులతో తగ్గనున్న దిగుబడి



తల్లాడలోని మామిడి తోట



ఎండకారణంగా వడబడిపోతున్న మామిడి పూత

తల్లాడ: ఫలరాజు మామిడికి మంచుదెబ్బ తగులుతోంది. ఎన్నో ఆశలతో సాగుచేసిన మామిడి తోటలకు ఈ ఏడాది గడ్డు పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఇందుకు కారణం వాతావరణంలో వస్తున్న మార్పులేనని ఉద్యావన శాఖాధికారులు, రైతులు అంటున్నారు. రాత్రి మంచు, పగలు ఎండలకు పూత నిల్వకుండా పోతుంది. ఆలస్యంగా పూస్తున్న పూత పగలు బాగా వస్తున్న ఎండలకు నిల్వకుండా రాలిపోతుంది. పూత ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 32వేల ఎకరాల్లో..

ఖమ్మం జిల్లాలో 32వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో ముదురు, లేత తోటలు ఉన్నాయి. చిన్న రసాలు, బంగినపల్లి, తోతాపురి, పెద్ద రసాలు, ముంత మామిడి, హిమామ్ పసందు, జాంగిరి, మల్లిక వంటి మామిడి రకాలను సాగు చేస్తున్నారు. సత్తుపల్లి డివిజన్ మామిడి పంటకు ప్రసిద్ధి. సత్తుపల్లి డివిజన్‌లో 18 వేల ఎకరాలు మామిడి తోటలున్నాయి. డివిజన్ వ్యాప్తంగా మామిడి తోటల పరిస్థితి ఇలాగే ఉంది.

రాలిపోతున్న మామిడి పూత..

ఈ ఏడాది జనవరిలో పూయాల్సిన పూత ఫిబ్రవరిలో పూసింది. మార్చిలో ముదురు తోటల్లో కాయలు కోస్తుంటారు. రైతులు పూత నిలవడం కోసం జనవరి నుంచే 5నుంచి 8సార్లు వివిధ రకాల మందులు కొట్టినా పూత నిలవడం లేదు. మందులు స్ప్రేకోసం ఒక్కో ట్యాంక్‌కు రూ.10వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. తేమ శాతం లేకనే ఇలా పూత రాలుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మంచు కారణంగా మామిడి తోటల్లో ఎదుగుదల లోపిస్తోంది. దిగుబడిపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి

కౌలు రైతుల పరిస్థితి దయనీయం..

మామిడి తోటలను ఈ ప్రాంతంలో కౌలు రైతులే ఎక్కువగా పంటను కోసి విక్రయిస్తుంటారు. ముందుగానే ఎకరానికి రూ.20 నుంచి రూ.40 వేల వరకు తోటలను బట్టి కౌలు ధర నిర్ణయించుకొని తోటలను పోషణ చేస్తుంటారు. తల్లాడ మండలంలోని కుర్నవల్లి, రంగంబంజర, రామానుజవరం, లక్ష్మీపురం, బస్వాపురం, మల్సూర్‌తండా, గాంధీనగర్‌తండా, రేజర్ల, బిల్లుపాడు, వెంగన్నపేట, ముద్దునూరు, రంగాపురం, కలకొడిమ, పినపాక, తల్లాడ, గాంధీనగర్ తండా, అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల్లో మామిడి తోటలున్నాయి. ఈ సారి కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

పూత నిలవటం లేదు..



ఎన్ని మందులు కొట్టినా మామిడితోటలో పూత నిలవటం లేదు. ఇప్పటికే జనవరి నుంచి ఫిబ్రవరి నెల వరకు ఐదు సార్లు మందులు స్ప్రే చేసినా.. పూత నిలవటం లేదు. ఫిబ్రవరి నెలలో సైతం ఇంకా పూత, పిందె మీదనే తోటలున్నాయి. ఈ పూత కూడా పగలు వస్తున్న ఎండలకు నిలిచే అవకాశం లేదు. దీంతో ఈ సంవత్సరం కూడా మామిడి రైతులకు నష్టాలే. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– కోదూరు వీరకృష్ణ, మామిడి రైతు, గొల్లగూడెం

వాతావరణ మార్పులతో..



డిసెంబరు, జనవరి నెలలో వచ్చిన పూత మాత్రమే నిలుస్తుంది. వాతావరణంలో వస్తున్న మార్పులు వల్ల ఈ ఏడాది మామిడి తోటల్లో పూత నిలవకుండా పోతుంది. ఇప్పుడు ఫిబ్రవరి నెలలో పూత వచ్చినప్పటికీ వేడి వల్ల నిల్వదు. నిలచినా కాయలో పెరుగుదల ఉండదు. పూత పూసే సమయంలో రసం పీల్చే పురుగు ప్రభావం అధికంగా ఉంటుంది. కావున మామిడి తోటలకు ప్లానా ఫిక్స్ మందు స్ప్రే చేయాలి.

– ఎంవీ.మధుసూధన్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

ఘనంగా మృత్యుంజయ హోమం



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న గ్రామస్తులు

కారేపల్లి: కారేపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో మృత్యుంజయ హోమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు దోసోజు పరిపూర్ణాచార్యులు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం శ్రీ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు, ఈ సందర్భంగా మహా అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

తల్లాడ: తల్లాడలో వేంచేసి ఉన్న హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం వైభవంగా తులాభారం, యాగశాల పూజలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యాపకుడు రొంపిచర్ల వెంకట సత్యనారాయణ, స్థానిక పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం ప్రధాన అర్చకుడే దివి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద స్వామికి తులాభారం నిర్వహించారు. మోదకములు(లడ్డూలు), పటిక బెల్లం, పసుపు, కుంకుమ, పసుపు కొమ్ములు, అరటి పండ్లు తులాభారం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం ఈ నెల 9వ తేదీన ప్రతిష్ఠ సందర్భంగా శనివారం యాగశాలలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, భజన బృందాలతో కలిసి ఊరేగింపుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, దురిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్టదా ?



మాట్లాడుతున్న హేమంతరావు

కొణిజర్ల: రైతుల బాగోగులు చూసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏమి పట్టనట్లు వ్యవహరించడం సరికాదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు అన్నారు. శనివారం కొణిజర్లలోని శ్రీరామ కల్యాణ మండపంలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, దడిపిన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం కొణిజర్ల మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రైతుల పంటలకు సాగునీరు లేక ఒకవైపు.. గిట్టుబాటు ధర లేక మరోవైపు రైతులు నష్టపోతుంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 20న వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలను రైతులు జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గోవిందరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రామకోటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పోషకాహారం అందిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

వేంసూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. శనివారం మండల పరిధిలోని భీరపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ భవాని, సామాజిక కార్యకర్త హరిప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, రాహుల్, చంద్రకళ, అనంత లక్ష్మి, రత్నకుమారి, వాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, వెంకటాపురం గ్రామాల్లో శనివారం నూతన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ఆశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ అనురాధ, ఏఈ అనూష మాట్లాడుతూ.. గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు గానూ నూతనంగా 25కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోవిద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి గౌరవ డాక్టరేట్



రాయప్రోలు విశ్వప్రసాద్

మధిర: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన రాయప్రోలు విశ్వప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. 1991 నుంచి గణిత శాస్త్ర బోధనలో రాణిస్తున్న ఆయన సేవలను గుర్తించి హానరరీ డాక్టరేట్ అవార్డ్స్ కౌన్సిల్(హెచ్‌డీఏసీ), వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్(డబ్ల్యూహెచ్‌ఆర్‌పీసీ) ద్వారా గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. ఇంటర్ వరకు మండలంలో, డిగ్రీ ఖమ్మంలో పూర్తిచేసిన ఆయన గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, ఎంఈడీ, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ పూర్తిచేసిన ఆయన ప్రస్తుతం ఓయూలో ఎంబీఏ(ఫైనాన్స్), కాంచి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. అంతేకాక ఆయన రాసిన ఏడు పరిశోధనాపత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమవగా, అంతర్జాతీయ సదస్సుల్లో రెండు పరిశోధనా పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న విశ్వప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ లభించడంపై పలువురు అభినందించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

మధిర: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని మధిర సీఐ మధు కోరారు. మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో, ఎంఈఓ ప్రభాకర్ అధ్యక్షతన.. శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం పుల్లఖండం చంద్రశేఖర్ సహకారంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కళాశాలలో ఫేర్‌వెల్‌డే వేడుకలు..

శ్రీనిధి డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలను స్థానిక అభిరామ్ ఫామ్ రిసార్ట్స్‌లో.. విద్యాసంస్థల చైర్మన్ అనీల్ కుమార్ నెహ్రూ అధ్యక్షతన నిర్వహించగా సీఐ మధు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీఐ మధుని.. కళాశాల చైర్మన్ అనీల్ కుమార్ నెహ్రూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సైన్స్ డే పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల: గత నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి గెలుచుకున్నారు. అదే విధంగా వన్ మినిట్ షోలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపల్ రజిత, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు రజిని, కేపీ ఐశ్వర్య, రాజేశ్వరి, అధ్యాపక బృందం అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

సత్తుపల్లిటౌన్: రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కాకతీయ, గాయత్రి కళాశాల కరస్పాండెంట్ కూసంపూడి మధుసూదన్‌రావు అన్నారు. శనివారం గాయత్రిజూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వీరారెడ్డి, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

చింతకాని: ఈనెల 9న ఖమ్మం రామనర్సయ్య నగర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు కోలేటి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, నాగసురేష్, నాగరాజు, శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు.

అనుమతులను రద్దు చేయాలి

తల్లాడ: తల్లాడ పట్టణంలోని రింగ్ రోడ్ సెంటర్లో ఫారెస్ట్ కార్యాలయానికి అనుమతులను రద్దు చేయాలని, ఇక్కడ అనుకూలంగా ఉండదని, తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం అధికారులకు వినతిపత్రం అందించారు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ఆఫీస్ ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని వారు వినతిలో పేర్కొన్నారు. ఇచ్చిన పర్మిషన్‌ను రద్దు చేయాలన్నారు. తల్లాడ పంచాయతీ ఈఓ కృష్ణారావుకు, తల్లాడ డీఆర్‌ఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాపా సుధాకర్, కటికి కిరణ్‌కుమార్, మేడి సీతారాములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ముదిగొండ: మండలంలోని ఖానాపురంలో 107మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని గ్రామస్తులు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామిలకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పుడు కొద్దిమందికి మాత్రమే ఇస్తామని చెప్పటం సరికాదన్నారు. అందరికీ ఇళ్లు ఇవ్వాలని వారు అధికారులను కోరారు.

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శిగా వసంతరావు ఎన్నిక

చింతకాని: ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్ల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిగా మండలంలోని కొదుమూరు గ్రామానికి చెందిన నారపోగు వసంతరావు ఎన్నికయ్యాడు. ఖమ్మం నగర పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో శనివారం జరిగిన ఏఐటీయూసీ జిల్లా నాల్గో మహాసభలో ఆయన్ని ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా వసంతరావును సీపీఐ పార్టీ, ఏఐటీయూసీ మండల నాయకులు అభినందించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామంలో మహా శివరాత్రి, శ్రీ వీరభద్రస్వామి పండగలను పురస్కరించుకొని గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను గ్రామపెద్దలు రామకృష్ణ, వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్‌చేసిన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శివరాం, పృథ్వీరాజ్, శివ, వేణు, కిషోర్, కల్యాణ్, ప్రవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజలు చేశారని ఆందోళన

కొణిజర్ల/తల్లాడ: కొణిజర్ల మండలంలోని ఉప్పలచలకకు చెందిన రైతు బాదావత్ సైదులు మొక్కజొన్న చేను వద్ద పసుపు, కుంకుమ, ఎముకలు ఉండడంతో క్షుద్రపూజలు జరిగాయనే సమాచారంతో శనివారం ఉదయం సమీప రైతులు ఆయనకు సమాచారం ఇచ్చారు. దీంతో పరిశీలించిన ఆయన ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, తల్లాడ మండలం నూతనకల్ శివారులో లోకారం-గూడూరు రహదారిపై కొబ్బరి కాయ, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, కోడి నెత్తురు, కోడి మాంసం ఉండడంతో స్థానికులు శనివారం గుర్తించి ఆందోళన చెందారు. కాగా, క్షుద్రపూజలు వంటివి లేవని తెలిసినా ఇలాంటి ఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నందున అధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పేదలందరికీ పనులు కల్పించాలి

సత్తుపల్లిరూరల్: పేద కూలీలందరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలని రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బీకేఎం వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసి కూలీల పొట్ట కొట్టేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, దీనిని కూలీలు ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూమిలేని ఉపాధిహామీ కూలీలందరికి ఇస్తానన్న రూ.12వేలను వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాంబాబు, వీరయ్య, సతీష్, సత్యావతి, పద్మ, రామలక్ష్మి, రాములమ్మ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి



పెనుబల్లి: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటేశ్వరరావు

మధిర/ముదిగొండ: మాదిగ అమరవీరుల ఆశయ సాధనకోసం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, మండల ఇన్‌చార్జ్‌లు నూకల నాగేశ్వరరావు, ఎల్.భద్రం తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం మధిరలోని ఎస్సీ కాలనీలో, ముదిగొండలో అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే ప్రతిపోరుకు మాదిగలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీను మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, రాజా మాదిగ, స్వామి, ఏనూక, రమేష్, ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు మాదిగ, అనీల్ మాదిగ, వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు రాంబాబు, ఎమ్మెస్పీ మండల అధికార ప్రతినిధి సురేష్‌మాదిగ పాల్గొన్నారు.

మృత వీరులకు నివాళులు

పెనుబల్లి/వేంసూరు: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు కోల్పోయిన మృత వీరుల చిత్రపటాలకు మండల ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు కొలికపోగు వెంకటేశ్వరరావు అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, పుల్లారావు, అంజయ్య, ప్రసాద్, కృష్ణ, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, కలపాల ఏసు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, బాలస్వామి, ప్రసాద్, రవి, రాములు, సాంబయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.